ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 18.01.2025 సమయం. 13-10 గంటలు

ముఖ్యాంశాలు

1) సింగపూర్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం ఆ దేశ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ తో సమావేశం అయింది.

2) కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు, రేపు ఆంధ్రప్రదేశ్ లో పర్యటిస్తారు.

3) రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒకరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

4) ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని ఆలోచనలను దేశ , విదేశాల ప్రజలతోపంచుకునే 'మన్ కీ బాత్ ' కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమవుతుంది.

**REVANTH REDDY SINGPORE TOUR LATEST**

సింగపూర్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ని ప్రతినిధి బృందం ఆ దేశ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ తో సమావేశం అయింది. తెలంగాణలో వివిధ రంగాలలో సింగపూర్ ప్రభుత్వం భాగస్వామ్యంపై ఈ సందర్భంగా వారు చర్చలు జరిపారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను రేవంత్ రెడ్డి బృందం వారికి వివరించారు. ప్రధానంగా నగరాలు, పట్టణాల అభివృద్ధి , మౌలిక సదుపాయాలు , నీటి వనరుల నిర్వహణ , నైపుణ్యాల అభివృద్ధి, స్పోర్ట్స్, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాలకు ఉన్న అనుకూలతలను ముఖ్యమంత్రి బృందం సింగపూర్ వాణిజ్య మంత్రికి వివరించారు. కాగా......తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందించేందుకు సింగపూర్ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలనే తెలంగాణ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని గ్రేస్ ఫు హైయిన్ హామీ ఇచ్చారు.

DESK

**SRIDHAR BABU SINGAPORE TOUR**

రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం ... ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సింగపూర్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అసోసియేషన్ (ఎస్ ఎస్ ఐ ఏ ) తో ప్రత్యేక రౌండ్ టేబుల్ చర్చ నిర్వహించారు. ఈ చర్చల్లో రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమ

స్థాపనకు అందుబాటులో ఉన్న అనుకూలమైన పరిస్థితులను మంత్రి శ్రీధర్ బాబు వారికి వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం , ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే సహకారం ప్రోత్సాహకాలను శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానానికి ఎస్ ఎస్ ఐ ఏ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.

DESK

**AMITH SHAW AP TOUR**

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు, రేపు ఆంధ్రప్రదేశ్ లో పర్యటిస్తారు. ఈ సాయంత్రం అమిత్ షా గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నివాసంలో ఆయనతో సమావేశం అవుతారు. ఈ రాత్రి అమిత్ షా గౌరవార్థం చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసిన విందులో అమిత్ షా పాల్గొంటారు. రేపు కృష్ణా జిల్లా, గన్నవరం సమీపంలో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్ (NDRF), ఎన్ ఐ డీ ఎం (NIDM) ప్రాంగణాలను అమిత్ షా ప్రారంభిస్తారు.

DESK

**RAJA NARASIMHA ON MBNR HOSPITAL**

మహబూబ్ నగర్ ప్రభుత్వం ఆస్పత్రిలో 10 కోట్ల రూపాయలతో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రం ఏర్పాటు చేసి ఉగాది పండగ నుంచి స్కానింగ్ సేవలు ప్రారంభిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ చెప్పారు. ఆయన నిన్న మహబూబ్‌నగర్ సర్వజన ఆసుపత్రిపై ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు , అధికారులతో కలిసి సమీక్షజరిపారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఆరోగ్య

ఉపకేంద్రాలు, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు.... బస్తీ దవాఖానాల ఏర్పాటుపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆస్పత్రిలో త్వరలోనే కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను సైతం అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఐదు వైద్య కళాశాలలు, జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల అభివృద్ధికి 100 కోట్ల రూపాయల నిధులు ఇస్తామని మంత్రి వివరించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో, వేర్వేరుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

DESK

**DGP JITENDER MBNR**

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. ఆయన నిన్న మహబూబ్ నగర్ నారాయణపేట జిల్లా పోలీస్ అధికారులతో.... మహబూబ్ నగర్ ఎస్పీ కార్యాలయంలో సమావేశం అయ్యారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... జిల్లాలో శాంతి భద్రతలు కాపాడే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని డీజీపీ సూచించారు.

PTC MBNR

**BJP NVSS ON REVANTH REDDY**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం నమ్మడం లేదనే సంకేతాలు కనిపిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు.

ఈరోజు ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి ఎన్ని సార్లు ఢిల్లీకి వచ్చి ఆ పార్టీ హైకమాండ్ కు విన్నవించినా మంత్రివర్గ విస్తరణ చేపట్టకపోవడం వెనుక కారణం ఇదే అని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని ఒప్పించడం, మెప్పించడం కోసం రేవంత్ రెడ్డి పదే పదే ప్రధాన మంత్రి మోడీని , RSS ను విమర్శిస్తున్నారని ప్రభాకర్ చెప్పారు.

NE SDP

**ASFBD BIRD WATCH**

ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ డివిజన్ పరిధిలో నేడు రేపు అటవీ శాఖ ఆధ్వర్యంలో బర్డ్ వాచ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాగజ్ నగర్ అటవీ డివిజన్ అధికారి సుశాంత్ సుఖదీర్ మాట్లాడుతూ ఆఫ్రికా ప్రాంతం నుండి జిల్లాలోని ప్రాణహిత పరివాహక ప్రాంతానికి పక్షులు వలస వస్తున్నాయని తెలిపారు. అంతరించిపోతున్న పక్షి జాతి అయిన రాబందుల నివాసం పాలరావు గుట్ట వద్ద రాబందుల నివాసానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని కాగజ్ నగర్ , సిర్పూర్ (టి) , పెంచికలపేట, బెజ్జూర్ మండలాల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో రెండు రోజులపాటు బర్డ్ వాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

PTC ASFBD

**PONGULETI INDIRAMMA ILLU**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒకరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనని రెవెన్యూ , గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన నిన్న సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లు , వీఆర్వో వ్యవస్థ ,

సర్వేయర్ల నియామకంపై సమీక్ష జరిపారు.  మొదటి  విడతలో స్థలం ఉన్నవారికి, రెండో విడతలో ఇంటి స్థలంతోపాటు ఇల్లును నిర్మించి ఇస్తామని మంత్రి చెప్పారు.  ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నివాస స్థలం ఉన్నవారి జాబితా , నివాస స్థలం లేనివారి జాబితాను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు.

PRESS NOTE

**MALLU BHATTI ON SC ST SUB PLAN**

సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఎస్సీ,  ఎస్టీ వర్గాల్లో ఆదాయం పెరిగేలా ,  స్థితిగతులను  మరింత  మెరుగుపరుచుకునేలా  ప్రణాళికలు తయారు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు  భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆయన నిన్న సచివాలయంలో  ఎస్టీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు తీరుపై  సమీక్ష నిర్వహించారు.  సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేయాలని ..... శాఖల వారీగా ఖర్చుల వివరాలు ప్రతినెలా వెల్లడించాలని ఆయన సూచించారు. ఎస్సీ , ఎస్టీ సబ్ ప్లాన్ పై ఈనెల 23న సమావేశం నిర్వహించనున్నట్లు  భట్టి విక్రమార్క చెప్పారు.

DESK

**MAN KI BAHTH**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని ఆలోచనలను దేశ , విదేశాల ప్రజలతోపంచుకునే 'మన్ కీ బాత్ ' కార్యక్రమం రేపు  ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమవుతుంది. ఇది ప్రతినెలా ప్రసారమయ్యే రేడియో కార్యక్రమంలో118వ సంచిక. కాగా , ఈ కార్యక్రమం  ఆకాశవాణి , దూరదర్శన్

మొత్తం నెట్‌వర్క్, AIR న్యూస్ వెబ్‌సైట్, ఐ అండ్ బి మంత్రిత్వశాఖ YouTube ఛానెల్‌లలో కూడాప్రత్యక్ష ప్రసారం అవుతుంది. హిందీ ప్రసంగం ముగిసిన వెంటనే ప్రాంతీయ భాషల్లో ఈకార్యక్రమం అనువాదం ప్రసారం అవుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి కేంద్రాలు తెలుగు అనువాదాన్ని రేపు రాత్రి 8 గంటలకు పున: ప్రసారం చేస్తాయి.

NSD

**KISHAN REDDY**

భారత్‌ను విశ్వ గురువుగా నిలపడమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆయన నిన్న హైదరాబాద్ లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ....భారత రాజ్యాంగాన్ని , అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని.. రాజ్యాంగం విలువలను, అంబేడ్కర్ ఆశయాలను ప్రజలకు తెలియజేసేందుకే 'సంవిధాన్ గౌరవ్ అభియాన్ ' కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టిందని చెప్పారు. భారత గణతంత్రానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 26 నుంచి 2026 జనవరి 26 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని కిషన్ రెడ్డి తెలిపారు.

DESK

**NTR VARDHANTHI**

సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే సూక్తిని మొదటి సారిగా ప్రజలకు పరిచయం చేసింది నందమూరి తారక రామారావు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు .... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తరాక రామారావు 29వ వర్ధంతి

సందర్భంగా ఆయన ఎన్టీర్ కు నివాళులర్పించారు.        పేదల కోసమే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని.... పేదల సంక్షేమం కోసం సాహసోపేతమైన పథకాలను అమలు చేశారని ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు.  ఆయన తండ్రి  స్వర్గీయ నందమూరి తరాక రామారావు   29వ వర్ధంతి సందర్భంగా ఈరోజు బాలకృష్ణ  హైదరాబాద్ లోని  ఎన్టీ ఆర్ ఘాట్ లో   ఆయన సమాధి వద్ద పుష్ప గుచ్చం ఉంచి నివాళులర్పించారు.

DESK